
# నివాళి

**చంపక్**




**కో**కాకోలాకి కొబ్బరి నీళ్ళకూ ఉన్నంత తేడా- పట్నవాసానికీ, పల్లె జీవనానికీ!

క్యారేజీ భోజనం, నూడుల్స్, ఉరుకులూ పరుగులూ ప్రపంచం నుంచి పెరు గన్నం, ఆవకాయ, బొబ్బట్లు, చేగోడీల తాపీ ప్రపంచంలో అడుగుపెట్టాను ఓ నెలరోజు లుందామని. పదోక్లాసు పరీక్షలయాయి. ఫలితాలొచ్చేవరకూ పల్లెలో తాతగారి వద్ద కొచ్చాను.

పల్లెనిండా మురికి, దుమ్ము, ధూళి. అయినా తాతగారింట గంగాళాలతో ప్రేమాభిమానాలు! రాక రాక తాతగారింటి కొచ్చానేమో. అలా ఊళ్ళోకి వెళ్తే చాలు - జగన్నాథం గారి మనవడు! పట్నం నుంచి వచ్చాడు!- అని అందరూ ఆరాధన, గౌరవం చూపేవారు. తోటలోకి తీసుకెళ్ళి మామిడికాయలు కోసి ఉప్పు, కారం అద్ది ఆప్యాయంగా అర్పించుకునే వారు. కొబ్బరి నీళ్ళూ, తాటి ముంజెల సంగతి చెప్పనే అక్కర లేదు.

ఊళ్ళో తాతగారి కెంత గౌరవం! అని మురిసిపోయేవాడిని.

డాడీ చిన్నప్పుడు చదువుకున్న స్కూలు చూస్తే బాధేసింది. పెచ్చులూడిన గోడలు. సగం కూలిన పైకప్పు. ఊళ్ళో కాపురం ఉండక ప్రక్కపట్నం నుంచి పిక్నిక్ కోసం అన్నట్లు వచ్చే టీచర్‌లు, ఎప్పుడూ ఆడుకుంటూ కనిపించే విద్యార్థులు! సాయంకాలాలు వాళ్ళతో కలిసి ఫుట్‌బాల్ ఆడేవాడిని. తొమ్మిదో క్లాసు చదివే ప్రవీణ్ మిత్రుడయాడు.

ఓ సాయంకాలం ఫుట్‌బాల్ ఆడుతూండగా - బంగాళాదుంపలాగా గుండ్రంగా పొట్టిగా ఉన్న ఒకాయన వచ్చాడు. వస్తూనే - అబ్బాయిలూ! దెబ్బలాడుకోకండి - అని అరిచాడు. దెబ్బలాటకాదు, బంతాట అని చెప్పగా

వినిపించుకోకుండా – ఒక్క బంతి కోసం ఎందుకు తున్నుకుంటారు! తలోకటీ కొనిస్తాలే – అన్నాడు ఉదారంగా.

నవ్వుకుంటూ అతని చుట్టూ చేరాం.

పది సంవత్సరాలుగా పేరుకుపోయిన బూజులాగ అతని తలమీద జుట్టు! సర్వం మింగే గుహ లాగ నోరు! గాదెలాంటి పొట్ట! గుండీలు లేని ముతక షర్ట్. మురికి పట్టిన ముతక పంచె.

అతడు నవ్వితే చాలు చెట్టుమీద పక్షులు భయపడి ఎగిరిపోతున్నాయి! అతడే ఆలూ ప్రసాద్! రాబోయే ఉప ఎన్నికలో ఎం.ఎల్.ఏగా పోటీ చేస్తున్నాడు. నలుగురు గుమిగూడిన ప్రతి చోటా ప్రత్యక్షమై వరాలూ, వాగ్దానాలూ కురిపిస్తున్నాడు.

"మాకు బంతులిస్తానన్నారు బాగానే ఉంది గాని వాటి బదులు ఓట్లు వేయాలంటే మాకు ఓట్లు లేవే" విచారం నటించాడు ప్రవీణ్.

"ఫర్వాలేదు. నేను మీకు ఓట్లు యిప్పిత్తా. మీ చేత ఓట్లు ఏయిత్తా. తప్పకుండా కొబ్బరి గుర్తుకే ఓటు వేయండేం!" అంటూ నా వైపు తిరిగి "నువ్వు జగన్నాథం గారి మనవడివి కదూ! పట్నంలో పరీచ్చ రాశావ్ కదూ! నీకు మంచి మార్కులేయిత్తా. తర్వాత ఇంటర్ చదవనక్కర లేదు. నేను పాస్ చేయిత్తా. ఇంజినీర్ చేయిత్తా. ఉద్యోగం యిప్పిత్తా. బెంగపడకు" గడగడా చెబుతూ గునగునా దొర్లుకుంటూ పోయాడు. భలే కామెడీ ఫిగర్!

అసాధ్యుడు. నిజంగానే కొందరికి దొంగ సర్టిఫికెట్లూ, కొందరికి ఉద్యోగాలూ ఇప్పించాడు. అంతెందుకూ, మా స్కూలులోనే పట్నం మాస్టారు గయారాం ఉన్నారు. ఆయన కిక్కడ పనిచేయడం యిష్టం లేదు. ఆయన బదులు ఆయారాం పని చేస్తారు. జీతాల రోజున మాత్రం గయారాం వచ్చి జీతంలో సగం ఆయారాం కిచ్చి ఇద్దరూ వెళ్ళి ఆలూ ప్రసాద్‌కి చెరో వెయ్యి సమర్పించుకుంటారు. ఎందుకంటే ఈ ప్లాన్ వేసింది ఆయనే" ప్రవీణ్ చెప్పగా నిర్ఘాంతపోయాను.

నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు మాదిరిగానే నకిలీ మాస్టార్లు!

మర్నాడేమీ తోచక స్కూలు వైపు వెళ్లాను. పదో క్లాసు తప్ప మిగిలిన క్లాసులు జరుగుతున్నాయి. ఆరో క్లాసులో ఆయారాం ఉన్నారు. బోర్డు మీద భీష్ముని వంశవృక్షం బొమ్మ గీసి వుంది. పైన "భీష్ముడు" అని రాసి కింద గీత గీసి, ఆ గీత కింద ఇటు ధృతరాష్ట్రుడు, అటువైపు పాండురాజు అని రాసి ధృతరాష్ట్రుని కింద కౌరవులు, పాండురాజు కింద పాండవులు అని రాసి ఉంది.

క్లాసు అయి మాస్టారు బయట కొచ్చాక – భీష్మునికి పెళ్ళేకాలేదు. పిల్లలెక్కడనుంచి వచ్చారని అడిగాను.

"వాళ్లంతా కుండ బేబీస్" అన్నారు మాస్టారు.

"కుండ బేబీసా?!"

"ఈ రోజుల్లో టెస్ట్‌ట్యూబుల్లో మాదిరిగా ఆ రోజుల్లో కుండల్లో పిల్లలు పుట్టేవారు!"


ఆ సమాధానం విని అవాక్కు అయాను. అనుమానం లేదు. ఆయన నకిలీ మాస్టారే.

ఓ ఆదివారం ప్రవీణ్ కోసం వాళ్ళ పేటకు వెళ్తే అక్కడ ఆలూ యింటింటి ప్రచారం చేస్తూ కనిపించాడు. పిల్లల్ని ఎత్తుకుని ఆడిస్తున్నాడు. పెళ్ళీడు అమ్మాయిలకైతే సంబంధాలు చూసి పెడతా అంటున్నాడు. యువకులకు సర్టిఫికెట్లూ, ఉద్యోగాలూ అంటున్నాడు. పేకాటరాయుళ్ళకు పాకలు కట్టిస్తానంటున్నాడు. దొంగ సారా కాచేవాళ్ళకి అండగా ఉంటానని చెబుతున్నాడు. నమ్మినా, మానినా ఆయన మాటలకు అందరూ నవ్వుకుంటున్నారు. ఆనందిస్తున్నారు.

అయనటు వెళ్ళగానే మరో అభ్యర్థి గోపాల క్రిష్ణయ్య ఇటు వచ్చాడు. అందరూ లేచి గౌరవంగా నమస్కరిస్తూ ఆయన చుట్టూ చేరారు. చూడగానే నమస్కరించాలనిపించే హుందాతనం, గాంభీర్యం ఆయన సొత్తు. స్వాతంత్ర్య యోధుని కుటుంబంలోంచి వచ్చాడట.

## అంత అలకైతే ఎలా?

*'నా ప్రియుడి వైపు చూస్తే ఎవరినైనా కళ్ళు పీకేస్తా!' అంటూ వార్నింగ్ ఇచ్చిన కరీనా మాటలు చాలా మందినే బాధ పెట్టినట్లున్నాయి. షహీద్ కపూర్‌తో ఓ సినిమా చేస్తున్న అమృతారావ్ ఓ ప్రేమ సీన్ చేసేటప్పుడు "నీ దిల్‌రుబా ఏమో నీవైపు చూస్తే కళ్ళు పీకేస్తానంటోంది. మరి ఇప్పుడు మనం చేసే సీన్ చూస్తే ఏం చేస్తుందో? ఒక్కసారి ఆలోచించుకొని షాట్‌కి రా!" అంటూ పెద్దగానే చెప్పి కెమెరా ముందుకెళ్ళిందట! ఆ మాటలకి అందరూ నవ్వడంతో సిగ్గుపడటం షహీద్ వంతయింది.*



టూకీగా ప్రభుత్వ ఆర్థిక విధానాలనూ, అవినీతినీ తూర్పారబట్టి తనకే ఓటు వేయమని అర్థించాడాయన. ప్రజా ప్రతినిధి అంటే యిలా ఉండాలి. ఈయనే గెలవాలి అనిపించింది నాకు. ప్రాసకోసం గోపాల కృష్ణయ్య పేరుని నరికేసి ఆయన్ని పాలూ అనడం ప్రారంభించాయి పత్రికలు.

ఆలూ, పాలూలో ఎవరు గెలుస్తారో ప్రజాభిప్రాయాన్ని సేకరించి సెఫాలజిస్ట్ అయిపోవాలన్న కోరికతో కనిపించిన ప్రతివాడినీ అడగ్గా పాలూ గెలుస్తాడని తేలింది. ఎంతో ఆనందించాను. అయినా ఏదో మూల సంశయం. ఎలక్షన్‌కింకా పదిరోజులుంది. ఈలోగా ఏదైనా అద్భుతం జరగచ్చు.

ప్రచారం ఊపందుకుంది. రంగంలో పదిమందున్నా పోటీ ప్రధానంగా ఆలూ, పాలూ మధ్యనే. పత్రికలు రోజూ రకరకాల కథనాలు ప్రచురిస్తూనే ఉన్నాయి.

హెయిర్‌కట్ కోసం ఓ రోజు సెలూన్‌కెళ్ళి యథాలాపంగా గోవిందుని అడిగాను. అతడు కత్తెర సిద్ధం చేసుకుంటూ – నిజం సెప్పనా, అబద్ధం సెప్పనా అని, అడిగాడు – గుండు గీయనా, క్రాపింగా అన్నట్లు! నిజమే చెప్పమన్నాను.

నా చుట్టూ గుడ్డకప్పుతూ ఆలూకేస్తానన్నాడు. నా ఆశ్చర్యం చూసి–

"కిట్టయ్య మంచోడే. గొప్పోడే. కానీ లాబం లేదండీ. ఆలూ అయితే డబ్బు తిన్నా మన పని సేసి పెడతాడండీ. డిగ్రీ లిప్పించాడు. ఉద్యోగాలేయించాడు. ఆ మధ్య ఏదో గొడవలో

మా అన్న కొడుకుని పోలీసులు సిదగ్గొట్టి కొట్టులో పడేత్తే ఆడిని యిడిపించడానికి కిట్టయ్యని కలిశాం. న్యాయం, ధర్మం అంటూ ఆయనగారు కదలనే లేదు. తర్వాత ఆలూని కలిశాం. డబ్బుపోతే పోయింది. మావాడిని యిడిపించుకొచ్చాడు." చకచకా కత్తిరిస్తూనే గలగలా వివరించాడు. అతని వివరణలోనూ లాజిక్ ఉందనిపించింది.

పని పూర్తికాగానే కప్పిన గుడ్డను విప్పి గోవిందు దులుపుతూండగా పట్నం పత్రికా విలేఖరి వచ్చి అతనితో ఎలక్షన్ సీన్ గురించి ముచ్చటించి – నీ ఓటెవరికి? అని అడిగాడు.

"ఇంకెవరికీ! మా కిట్టయ్య బాబుకే. ఈ ఊరంతా ఆయనకే" ఉత్సాహంగా నమ్మకంగా చెప్పాడు గోవిందు. విలేఖరి వెళ్ళగానే నన్ను చూసి నవ్వేశాడు. "ఈ సదూకున్నోళ్ళకి మేం ఉత్తి సన్నాసి ఎదవల్లాగ కనిపిస్తాం బాబూ! అంతా తమకే తెలుసన్నట్టు పోజు పెడతారు. ఆలూకి ఓటేత్తానని ఈల్లకి నిజం సెప్పాన నుకోండి. ఎద్దేవా సేత్తారు. ఎవరికి ఓటెయ్యాలో తెలియని మూర్ఖులు. మీ తలరాత యింతే అని సుద్దులు సెబుతారు. వాదిస్తారు. నా పని సెడగొడతారు." వివరించాడు.

నేనింటి కెళ్ళి స్నానం చేసి వీధి వరండా మీద కొచ్చేసరికి అక్కడ తాతగారితో ఆలూ తన సహజ ధోరణిలో మాట్లాడుతూ – "బాబయ్యా తమరు మాత్రం నాకు ఓటేయకండి– అని బ్రతిమాలుతున్నాడు! నేను రాగానే మరేం లేదు బాబూ, మీ తాతయ్య ఎవరికి ఓటేస్తే వాళ్ళు ఓడిపోతారు!" అని నవ్వేశాడు.

అంతలో పత్రికా విలేఖరి అక్కడకొచ్చి– ఏమిటీ, డిగ్రీలూ ఉద్యోగాలూ యిప్పిస్తానని జోరుగా వాగ్దానాలు చేస్తున్నారట అని ఆలూని అడిగాడు.


"ఏం, నీకూ కావాలా?"

"అక్కరలేదు గాని అలా ప్రచారం చేస్తే ఎన్నికల కమీషన్‌కి, అవినీతి నిరోధక శాఖకీ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది." గంభీరంగా అన్నాడు విలేఖరి. ఒక్కసారిగా ఆలూ తరహా మారిపోయింది. "ఏనా కొడుకు అలా అన్నాడు? డిగ్రీలు చెట్టుకి ఏలాడుతున్నాయా, తెంపుకొచ్చి చేతిలో పెట్టేదానికి! ఉద్యోగాలు నా బీరువాలో మూలుగుతున్నాయా, తీసి అడిగినవాడికల్లా పంచీదానికి! ఆ విషయం నాకు తెల్దా? నేనెందుకలా ప్రచారం చేస్తాను! నా ఎదుగుదల చూసి ఓర్వలేని బిక్కపీనుగెవడో అలా వాగివుంటాడు. నా కులం సూసి కదా నువ్వలా ఎటకారం ఆడుతున్నావ్! కులాన్ని దూషించడం నేరం అని నీకు తెల్దా? నేనూ రిపోర్ట్ చేస్తా" రంకెలేశాడు ఆలూ. అంతే. అతని అనుచరులు విలేఖరిని చుట్టుముట్టగా రానున్న ప్రమాదం గ్రహించి అతగాడు తోక ముడిచాడు. ఆలూ తన పరివారంతో అటు వెళ్ళగానే యిటు గోపాల కృష్ణయ్య వచ్చి తాతగారితో మాట్లాడి వెళ్ళాడు.

ఎవరికి ఓటేసి ఓడించాలనుకుంటున్నావో చెప్పమని తాత గారితో మాట్లాడి వెళ్ళాడు.

## పేరు మార్చుకున్నదెందుకో?

*దక్షిణాదిన రాణించినా బాలీవుడ్‌లో బోల్తా కొట్టిన రీమాసేన్ తన పేరుకి 'ఎం' జత చేయాలన్న ఆలోచనలతో ఉందట. హిందీలో తన మొదటి సినిమా 'హం*



*హోగయే ఆప్కే' దుమ్మా కొట్టడంతో చాలా కాలం మరి అవకాశాలు రాలేదు. దాంతో 'ఎం' చేర్చుకోమని జ్యోతిష్కులు చెప్పడంతో ఆలోచనలో పడిందట రీమాసేన్.*

"బాల సెఫాలజిస్ట్‌వి! నువ్వే చెప్పాలి!" అని నవ్వేశారాయన.

దినం దగ్గర పడుతున్న కొద్దీ ఎన్నికల జ్వరం ఉధృతం అయింది. పాలు విజయం తథ్యమని పట్నం పత్రికలన్నీ ఘోషించాయి. ఎన్నికల రోజు రానే వచ్చింది. పోలింగ్ పూర్త యింది. ఫలితమూ వచ్చింది... ఆలూ విజయం. పాలూ రెండో స్థానంలో నిలిస్తే, మిగిలిన వాళ్ళకి డిపాజిట్ గల్లంతు. సామాన్య ప్రజలు మాకు ముందే తెలుసు అన్నారు. పత్రికలూ, మేధావులూ షాక్ నుంచి తేరుకో లేదు. సేఫాలజిస్ట్‌లు పోస్ట్‌మార్టం మొదలు బెట్టారు. పరీక్షలో ఫెయిల్ అయినంత బాధగా ఉంది. "ఏమిటి తాతయ్యా! ఇలా జరిగింది!" అన్నాను నిస్పృహగా.

"ఏం జరిగింది?" ఏమీ ఎరగనట్టు నవ్వుతూ అడిగారాయన.

"ఆలూ అవినీతిపరుడని అందరికీ తెలుసు. అయినా అతనినే ప్రజలెన్నుకున్నారంటే... అసలీ ప్రజలకు బుద్ధిలేదు. సరిగా ఆలోచించ లేరు. వీళ్ళకు ఓటు హక్కే లేకుండా చేయాలి"– ఉక్రోషంగా అన్నాను. ఓరి అమాయకుడా అన్నట్లు నవ్వుకొని "చదువుకున్న వారిలో అవినీతిపరులుండరనీ, వాళ్ళే సరియైన నిర్ణ యం తీసుకోగలరనీ నీ అభిప్రాయమా? కంప్యూటర్లూ, స్కానర్లూ, ఉపయోగించి దొంగ నోట్లు తయారు చేస్తున్నవారూ, పరీక్షాపత్రాలు లీక్ చేస్తున్నవారూ, మనుషుల్ని చంపుతున్న తీవ్రవాదులూ చదువుకున్న వాళ్ళు కాదా? ఓటర్లందరూ చదువుకున్న వాళ్ళే వున్న కేరళ నీ లెక్క ప్రకారం స్వర్గధామంలా ఉండాలి. అలా వుందా? తాతయ్య ప్రశ్నలు సందిస్తోంటే బిక్కముఖం వేశాను.

ఈలోగా నానమ్మ భోజనానికి పిలిచింది. అరటాకు మీద కమ్మని భోజనం! నానమ్మ నా ప్రక్కనే కూర్చుని వేడి అన్నంలో ఆవకాయ కలిపి, నెయ్యిపోసి ముద్ద నా నోటికి అందించింది. "మీ నాన్నకు కూడా యిలాగే తినిపించే దాన్నిరా" అంది ఆప్యాయంగా. ఆమె ప్రేమలో కరిగిపోయాను.

ఆహ్లాదకర వాతావరణంలో హాయిగా సంతృప్తిగా భోజనం చేయాలనేది తాతయ్య సిద్ధాంతం. నేనీ రెండు వారాలూ ఆ హాయిని అనుభవించాను. మా ఇంట్లో అయితే అంతా ఉరుకులూ, పరుగులూ, తొమ్మిది కల్లా క్యారేజీ సిద్ధం చేయడానికి నానా అవస్థా పడుతుంది అమ్మ. స్కూలులో లంచ్ విరామంలో బెడ్డల్లా తయారైన అన్నం, తోళ్ళు లాగ బిగుసుకు పోయిన కూర ముక్కల్తో గబగబా రెండు ముద్దలు మింగగానే మళ్ళీ క్లాసులు ప్రారంభం. ఇంట్లో రాత్రి భోజనం చేస్తున్నప్పుడు కూడా స్తిమితం ఉండదు. హోంవర్క్, పరీక్షల గురించి ఆందోళనే.

"నానమ్మా! నువ్వు చేసే పప్పు, రసం, కంది పచ్చడీ – అన్నీ బ్రహ్మాండం. అమ్మకూడా యింత బాగా చేయలేదు." అన్నానొకసారి. పొంగిపోయి కొసరి, కొసరి వడ్డించింది నానమ్మ.

తాతయ్య గలగలా నవ్వుతూ "నానమ్మ అన్నింటిలోనూ ప్రేమ కూరి పెడుతుందిరా. అందుకే అంత రుచి! చూశావా, నా వయస్సు అరవై దాటినా యాభై ఏళ్ళ కుర్రాడిలా కనిపించడానికి ఆ ప్రేమే కారణం" అన్నారు. నానమ్మ విచిత్రంగా సిగ్గుపడిపోయింది.

భోజనం అయాక తాతయ్య, నేనూ వీధి గదిలో చేరాం. ఆయన వాలు కుర్చీలో. నేను ఆయన ప్రక్కనే కుర్చీలో. ఇందాక ఆగిపోయిన సంభాషణ కొనసాగించారు తాతయ్య.

డబ్బివ్వకపోతే పనులెలా జరుగుతాయి – అనుకునే ప్రజలేగాని అవినీతిని రూపుమాపాలని ఎవరూ కంకణాలు కట్టుకుని కూచోరు. ఢిల్లీలో నిశాశర్మ అనే మహిళ వరకట్నం కోరిన కాబోయే భర్తను పోలీసులకు పట్టించిందని అందరూ ఘనంగా కీర్తించారు. కాని ఆమె కూడా కట్నం యివ్వడానికి మొదట ఒప్పుకుంది. అయితే రోజురోజుకీ అతడు గొంతెమ్మ కోరికలు కోరడంతో కోపగించుకుని జైల్లో తోయించింది. మరొక మహిళ పెన్షన్ బకాయిలు శాంక్షన్ చేసేందుకు ముప్ఫయి వేలు లంచం కోరిన అకౌంటెంట్ని సస్పెండ్ చేయించింది. ఈమె కూడా మొదట పదిహేను వేలు యివ్వడానికి ఒప్పుకొంది. అంతెందుకూ – ఈ ఊళ్ళోనే ఒక పుల్లాయ్ ఉద్యోగం కోసం ఒక వెధవాయ్కి యాభైవేలిస్తే వాడు డబ్బు తీసుకుని పారిపోయాడు. పత్రికా మేధావులు మోసం చేశారంటూ వెధవాయ్ని తిట్టారు గాని పుల్లాయ్కి భలే శాస్తి అయిందని ఎవరూ అనలేదు! అవినీతి అని గగ్గోలు పెట్టే మేధావులు కూడా లంచాలిస్తున్నారు. ఎదుటివాడు చేస్తే అవినీతి. అపనే తను చేస్తే –లౌక్యం అని సర్ది చెప్పుకునే వాళ్ళే అంతా. చదువుకున్న వాళ్ళకే ఓటుహక్కు కల్పిస్తే సమాజం బాగుపడిపోతుందనుకోవడం ఒక భ్రమ.

తాతయ్య పల్లెటూరి మనిషి. ఆయనకు వ్యవసాయం, ప్రేమ తప్ప మరేమీ తెలియదు. నా తెలివి ప్రదర్శించి ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేయాలన్న ఉబలాటంతో పల్లెకు వచ్చి ఇప్పుడు ఆయన వాగ్ధాటి ముందు మొద్దుబారి పోయాను.

"స్వచ్ఛమైన పాలూని కాదని అవినీతి పరుడైన ఆలూకి ప్రజలు పట్టం కట్టినప్పుడు, వాళ్ళకి అవినీతి మీదనే మోజు అయినప్పుడు నేను మాత్రం నీతిగా ఎందుకుండాలి? చదువు మానేసి డబ్బు పారేసి డిగ్రీలు, ఉద్యోగాలూ సంపాదిస్తా." అన్నాను ఉడుకుమోత్తనంగా. తాతయ్య ఓ క్షణం గంభీరంగా ఉండిపోయారు. ఆయన్ని నిరుత్తరుడిని చేసినందుకు సంతృప్తిగా ఉంది నాకు.

"అది సరేగాని ఆస్ట్రేలియాకు వెళ్ళిన మన క్రికెట్ టీమ్ గురించి చెప్పు" అన్నారు.

నాతో వాదించలేక ఆయన టాపిక్ మార్చినందుకు గర్వంగా అనిపించింది. క్రికెట్ అంటే నాకు పూనకం వస్తుంది. "అక్కడికి వెళ్ళే ముందు మనవాళ్ళంతా వట్టి వెధవాయ్లు. చిత్తుగా ఓడిపోయి వస్తారని అంచనా వేశారందరూ. రండి, రండి. మీ దుమ్ము దులిపేస్తాం అని ఆసీస్ ప్రగల్భాలు పలికారు. మనవాళ్ళు విజృంభించి 23 ఏళ్ళలో వాళ్ళ మీద వాళ్ళ దేశంలో మొదటి టెస్ట్మ్యాచ్ నెగ్గారు. 12 ఏళ్ళలో మొదటి వన్డేమ్యాచ్ నెగ్గారు. సింహాన్ని దాని గుహలోనే మట్టి కరిపించింది మన బెంగాల్ టైగర్! హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ మాత్రమే కాదు లక్ష్మణ్ కూడా అని మన సెంచరీల చిచ్చరపిడుగు నిరూపించాడు. కొత్త హీరోలు పుట్టుకొచ్చారు. వాళ్ళకు ఘన స్వాగతం లభించింది. సౌరవ్, ద్రవిడ్లకు పద్మపురస్కారంతో ప్రభుత్వం గౌరవించింది. కానుకలు వర్షించాయి. కీర్తి కురిసింది. మనవాళ్ళు చరిత్ర సృష్టించారు. నిజంగా భారత్ వెలిగిపోతోంది."

నా వాగ్ధాటికి అనకట్టవేసి "సెలక్టర్లకు లంచం యిచ్చి అసమర్థులు మన టీమ్లో దూరితే ఏం జరిగేది?" అడిగారు తాతయ్య.

"చరిత్ర పునరావృతమై భారత్ మసక బారేది. మన వాళ్ళు అర్ధరాత్రి విమానం దిగి ఎవరి కంటాపడకుండా దొంగల్లాగా యిళ్ళకు చేరి పిల్లుల్లాగ స్టోర్ రూంలో దూరి పడుకునేవారు."

"అవునా?! మరి నువ్వు లక్ష్మణ్ లాగ ఠీవిగా జీవిస్తావా? లంచం యిచ్చి దొంగలాగ, పిల్లిలాగ జారుకునే క్రికెటర్ మాదిరిగా జీవిస్తావా?"

తాతయ్య చాతుర్యానికి విస్తుపోయి "అమ్మ తాతయ్యా! ఎంత దెబ్బతీశావ్" అన్నాను ఆరాధన నిండిన స్వరంతో. ఆయన నా తల నిమురుతూ "సత్తాలేని సన్నాసుల్ని డిగ్రీలు, గుమాస్తా ఉద్యోగాలూ కొనుక్కుని కలుగులో ఎలకల్లాగ దొంగ బ్రతుకులు బ్రతకనివ్వు. నీవు మాత్రం నీ కీర్తితో తలిదండ్రులూ, నేనూ, దేశమూ వెలిగిపోయే విధంగా ఉన్నత శిఖరాలకు చేరుకో. కొనుక్కున్న డిగ్రీలతో సమున్నత స్థానం దక్కదు. తెలివి తేటలూ, సమర్థతా దేవుడిచ్చిన వరాలు. వాటిని సానబట్టి అత్యున్నత స్థానం పొందడమే నువ్వు దేవుడికిచ్చే నివాళి" అన్నారాయన గంభీరంగా. ఆయన్నే చూస్తూ అలాగే ఉండిపోయాను. ✻

